# ధర్మబుద్ధి

ఢభేలుమనే శబ్దం వినగానే ఎందుకోగాని భయంవేసి చప్పున సావిట్లోకి పరుగెత్తాను. ఆమె నేలమీదపడి వుంది. పైన నిచ్చెన వుంది. ఆ దృశ్యం చూసేప్పటికే నాకు చెమట్లుకమ్మినయ్.

నిచ్చెనలాగి "ప్రభా!" అన్నాను.

ఆమె మాట్లాడే స్థితిలో లేనట్టుంది. గచ్చునేలమీద ఎత్తునుంచి పడటంవల్ల దెబ్బ బలంగా తగిలి వుంటుందని తోచింది. మొహాన నీళ్ళుకొట్టి విసరసాగాను. కొంతసేపటికి ఆమె మూలగసాగింది.

"ప్రభా! ఎలావుందీ?" అన్నాను.

"అబ్బ! ...ఉస్! ...అబ్బ!...
అయ్యో! యీ చెయ్యి విరిగినట్టుగా వుందండీ! ......"
బాధతో ఏడ్వసాగింది.

నా మనస్సు పాడైంది; అసలు యీ ఆదివారం సెలవు యివ్వకుండా వుండటం యెంతమంచిదో ఇప్పుడే అర్థమైంది.

"ఆస్పత్రికి వెళ్దాం—" అన్నాను.

"పాడు...ఆస్పత్రి...!"

"అంతకన్న గత్యంతరంలేదు."

ఆమె జవాబు చెప్పకుండా యేడుస్తోంది. బజార్నపోయ్యే జట్కా పిలిచి చాలా శ్రమపడి ఆమెను ఆస్పత్రికి జేర్చాను. వెళ్ళగానే పరీక్ష జరిగింది.

పెద్దడాక్టరు అన్నాడు: "బొమిక బాగా దెబ్బతిన్నది. మత్తుమందు కింద దాన్ని సరిచెయ్యాలి—"

మత్తుమందుమాట వినేప్పటికి మళ్ళీ నాకు భయం వేసింది. నాకుతోడు ఎవ్వరూ లేకపోవటంవల్ల నాకు నేనే ధైర్యం చెప్పుకుంటున్నాను.

"మీరేమీ భయపడక్కర్లేదు. మరేమీ ప్రమాదం లేదు; ఒక్క పది రోజులపాటు ఇక్కడ ఇన్ పేషంట్ గా వుండాల్సివొస్తుంది-" అని డాక్టర్ ధైర్యం చెప్పాడు.

నేను ఒప్పుకోక తప్పిందిగాదు.

రెండుగంటలు గడిచాక మళ్ళీ ఆమె దర్శనానికి అనుమతి వొచ్చింది. ఒణికే శరీరాన్ని మెల్లిగా యీడ్చుకుంటూ వెళ్ళాను. మల్లెపువ్వులాంటి దుప్పటి పరిచివున్న మెత్తని పరుపు మీద ఆమె హాయిగా పడుకొనివుంది. ఎక్కువ బాధ పడుతూన్నట్టు తోచలేదు; హైరానై, నలిగి నీరసంగా వున్నట్టుంది.

"ప్రభా! ఇప్పు డెలావుందీ?"

"బాధ భరించే మోస్తరుగానే వుంది...ఇలాగే యీ పక్కలో కదలకుండా ఒకవారమన్నా వుండాలట."

చేతిమీద కప్పివున్న దుప్పటి తొలిగించి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కట్టిన గట్టికట్టును చూపింది. ఆమె బాధకు సాను భూతిగా నిట్టూర్చి ఫాలభాగాన్ని తాకాను.

నర్స్ గ్లాసులో పాలు తెచ్చింది. ఆమె శుభ్రతా, ఆమె ముఖంలో చిందులాడే సంతోషమూ చూస్తే—యీర్ష్యతో బాధపడి, మనంకూడా యీమెలాగా వుండేందుకు ఎందుకు ప్రయత్నం చెయ్యకూడదని అనిపించదా—యీ రోగు లందరికీ? అసలు ఇంత మంచి ముఖాలమధ్యవుంటేనే సగం రోగం పోతుందేమో?

ప్రభ తలకింద చెయ్యి ఆన్చి మెల్లిగా పాలను తాగించింది. బాధ పడే రోగులంటే వీళ్ళకు ఎంత అనురాగం! డబ్బుతో కొనుక్కోలేని అనేక సౌఖ్యాల్ని వీళ్ళు యీ మానవజాతికి ఉచితంగా ఎంత ఆప్యాయంగా అందజేస్తున్నారు!

"చెయ్యి నొప్పిగా వుందా?" అంది నర్స్.

"కొంచెం యిటు ఎత్తుగా వుంటే—" అంది ప్రభ.

చప్పున రెంచ్ తెచ్చి మంచాన్ని కావాల్సిన విధంగా ఎత్తింది నర్స్. ఎంత విశాల హృదయం!

ప్రభ ప్రస్తుత పరిస్థితి చూసి నేను పోగొట్టుకున్న ధైర్యంలో చాలా భాగాన్ని కూడదీసుకున్నాను.

మిగతా రోగులవైపు నా దృష్టి పోయింది. వాళ్ళల్లో ఎవ్వరూ బాధపడుతూన్నట్టనిపించలేదు: బాధను మరిచి

పోయినట్టున్నారు. ఆస్పత్రిఅంటే భూలోక నరకమనే అభిప్రాయం పోయింది. ఆంటిదగ్గర-ఆబైటి ప్రపంచంలోని బాధల్ని భరించలేక—వాటినుంచి తప్పించుకునేందుకు యీ బుల్లిప్రపంచంలోకి వీళ్ళందరూ వొచ్చారనిపించింది. వరండాలోంచి వీచే ఆ మలయ మారుతం తగుల్తేనే సగం బాధలు పోతయ్యనిపించింది.

నర్సు వొచ్చింది.

"మీరిక వెళ్ళిపోవాలి. రాత్రులు ఇక్కడ వుండేందుకు వీల్లేదు—"

"మరి ఆమెస్థితి—?"

"ఆమె కేమీ ఫర్వాలేదు. మేమందరమూ వున్నాం. ఈ హాలులో వున్న యేరోగికన్నా ఆమె ఎక్కువ బాధ పడటంలేదు. మీరు మళ్ళీ రేపు వుదయం రావొచ్చు."

ప్రభముఖంలోకి చూశాను.

"నాకేమీ ఫర్వాలేదు—మీరు రేపువొద్దురుకాని" అంది సంతోషంతో.

కాళ్ళీడ్చుకుంటూ బైటపడ్డాను.

## 2

ఆ రాత్రంతా ప్రభస్థితి తలుచుకుంటూ దిగులుపడ్డాను. మర్నాడు వుదయం ఆమెను చూసేందుకు వెళ్ళాను.

"రాత్రి నీకు బాగా నిద్రపట్టిందా?"

"ఓ! బాగా నిద్రపట్టింది. ఇక్కడ దోమలులేవు; నల్లులు లేవు. అసలు యీ పక్కమీద పడుకుని యెన్ని రోజులన్నా గడపొచ్చు—"

"ఇవ్వాళ ఎలావుందీ?"

"మీరు నా విషయం ఏమీ ఆదుర్దా పడనక్కర్లేదు. అరగంట అరగంటకూ నా క్షేమాన్ని విచారించే వాళ్ళ మధ్య నేను వున్నాను—"

ఆ సాయిత్రం మళ్ళీ వెళ్లాను. నేను అడక్కముందే ప్రభ అంది: "అబ్బ! ఎంత సౌఖ్యమయ ప్రదేశమండీ! ఎంత మంచి ఆహారం! ఎంత మంచి గాలి! వాళ్ళిచ్చే "చికిత్సకు" ఎంతైనా యివ్వొచ్చు. కాని రోజుకు మంచానికి రూపాయే నటగా తీసుకునేది?"

"ఔను—"

"ఎంత చౌకండీ! ప్రాణం ఎంత హాయిగా వుందనీ! తల్లులు తమ గారాబు పిల్లల్నికూడా యిలా చూస్తారను కోను. ఇక్కడ వుచితంగా వైద్యం చేస్తారు కనుక రోగుల్ని సరిగ్గా చూడరనుకునేదాన్ని. కాని యీ నర్సులు—నిజంగా దేవకన్యలండీ!"

ఆమెతోపాటే నాకూ చాలా తృప్తికలిగింది.

"నా కొక్క కోర్కె వుందండీ . . ." అంది. తగ్గు స్థాయిలో.

ఈ ఆపత్ సమయంలో ఆమె కోర్కె ఎలాటిదైనా తీర్చాలనే దృఢనిశ్చయంతో, "చెప్పు—" అన్నాను.

"ఇక్కడ వొక దిబ్బెన వుంది. రోగులు నయ మయ్యాక వెళ్తూ బీదవాళ్ళ చికిత్సకోసం తమకు తోచిన డబ్బును అందులో వేస్తారు. డబ్బు ఎంతైనా ఫర్వాలేదు. కాని అది యీ దేశంలోని బీదవాళ్ళకు, బాధపడే మానవజాతికి ఉపయోగపడుతుంది. మనం యీ జన్మానికి ఆ కాస్త ధర్మాన్నయినా చేసితీరాలి—"

"ఇరవై రూపాయలు వేద్దాం" అని నేను ఒప్పుకుం టానో, లేదో నని నా ముఖంలోకి చూసి మళ్ళీ అంది: "ఇదే యే డాక్టరు దగ్గరన్నా ఐతే. ఏ యాభై రూపాయలో తీసు కునేవాడు...ఐనా అక్కడంత మంచి వైద్యసహాయం లభిం చేది కాదు...ఏమంటారూ?"

"అలాగే వేద్దాం. నీకు త్వరగా నయంకావాలి కాని— ఇలాటి ఖర్చులు మనం ఎన్ని పెట్టటంలేదు!"

ఆమె తృప్తిగా నవ్వింది.

పదిరోజులయ్యాక ఇక యింటికి వెళ్ళొచ్చన్నాడు. ప్రాణ గండం గడిచిందనిపించింది ... ఇంటికి బయలు దేరేందుకు సిద్ధంగా వున్నాం.

"బండి పిలవండి..."అందామె.

"కింద సిద్ధంగానే వుంది"

"ఐతే పదండి—పోదాం"

ఆమె మరిచిపోయిన సంగతి ఇప్పుడే జ్ఞాపకంవొచ్చి, జేబులోంచి రెండు పదిరూపాయిల నోట్లను తీసి ఆమెకు యిస్తూ అన్నాను : "ఆనాడు నువ్వు ఆస్పత్రికి యిరవై రూపాయిలు ధర్మం చేద్దామన్నావ్; చేసెయ్—"

ఆమె ఆశ్చర్యపోతూ అంది : "ఇరవయ్యే! మంచి వారే! దానాలకూ ధర్మాలకూ మనదగ్గర ఏమంత డబ్బు వుందీ! మనం యేమన్నా భాగ్యవంతులమా ? మనం కూడా బీదవాళ్లల్లో లెక్కే!"

"పదిరోజులక్రితం భాగ్యవంతులమూ కాదు. ఈనాడు బీదవాళ్ళమూ కాదు. నువ్వు అనే ఆ బీదరికాన్ని మనకు మనమై తెచ్చుకొని బాధపడతాం. ఇలాటివి ఎన్ని ఖర్చు పెట్టడం లేదు ?"

"ఇలాటివి అనకండి...బట్టలు చాకయినయ్. ఈ డబ్బుకు నాకు ఒక మంచి చీర వొస్తుంది—"

"పోనీ చీరెకూడా కోనుక్కోవచ్చు; అది వేరే విషయం, అది మనవ్యక్తిగత సౌఖ్యం. కాని ఇది దేశంలోని బీద వాళ్ళందరికీ, బాధపడే మానవ జాతికి మన శక్తివంచన లేకుండా చేసే సహాయం."

"అబ్బ! మీతో నేను వాదించలేను. ఈ ఆస్పత్రి వాళ్ళకు ఇచ్చే తాహతు మనకుందని మీరు భ్రమపడు తున్నట్టున్నారు. వాళ్ళకు అమెరికానుంచి కోట్లరూపాయలు చందాలు వొస్తయ్. ఎంతడబ్బు లేకపోతే ఇంతమంది

రోగులకు ఇంత మంచి చికిత్స ఇస్తూ సౌఖ్యపెట్ట గలుగుతున్నారనుకున్నారు ?"

"అదికాదు ప్రభా! మనశక్తికొద్దీ—"

"మహావుందిలెండి శక్తి! శక్తిట! ఇలా డబ్బు తగలేస్తే—"

ఇక నాతో ఆస్పత్రిలో వాదించటం తన తాహతుకు తగదనుకుంది కాబోలు—విసుగుతో గిరుక్కున తిరిగి మెట్లు దిగ నారంభించింది.

నాలో నేనే నవ్వుకుంటూ ఆమెను అనుసరించాను.

బండి ఆస్పత్రి ఆవరణ దాటగానే "ఇలాంటి ఆస్పత్రులు మన దేశంలో వుండటం చాలా అవసరమే కాని—మన సహాయం యేమిటి చెప్పండి...ఇంకొక్క పది రూపాయిలు వేసి, రెండు మంచి కోయంబత్తూరు చీరెలు కొనుక్కుంటే—" అని నోట్లను భద్రంగా మడిచి జాకెట్ లోకితోస్తూ నాముఖంలోకి విజయసూచకంగా నవ్వింది.

—జనవరి, 1945

— ఐపోయింది —